

గోలేటి ఎక్స్‌రోడ్ సమీపంలో బ్యాగు తనిఖీ చేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

## వాహనాల తనిఖీ

రెబ్బెన, అక్టోబర్ 17: మండలంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గోలేటి ఎక్స్‌రోడ్ సమీపంలో గల దేవునిచెట్లు వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్తే సరైన ఆధారాలు చూపించాలని లేకపోతే ఆ నగదును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## దుర్గాదేవీ నవరాత్రోత్సవాల్లో అన్నదానం



బాపునగర్‌లోని దుర్గాదేవీ మండపం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 17: దుర్గాదేవీ నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బాపునగర్ శారదా గణేశ్ మండలి వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఏఎస్పీ అచ్యేశ్వరరావు, మాజీ ఎంపీపీ బాలేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకన్న పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పుల్లూరి రవి, గీత, అశ్విన్, వివేక్, మంగ, విలాస్, శ్రీనివాస్ గౌడ్, మహేందర్, శ్రీనివాస్, ప్రశాంత్, రజిని, శిరీష పాల్గొన్నారు.

### అన్నపూర్ణదేవీ అవతారంలో అమ్మవారు..



ఇందిరానగర్ కనకదుర్గాదేవీ ఆలయంలోపూజలు నిర్వహిస్తున్న భక్తులు

రెబ్బెన, అక్టోబర్ 17:మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో కొలువైన శ్రీ కనకదుర్గాదేవీ స్వయంభూ మహంకాళి ఆలయంలో మంగళవారం దుర్గామ్మతల్లి అన్నపూర్ణదేవీగా భక్తులకు దర్శనం ఇవ్వగా ఆలయ అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# దళితబంధుతో బతుకుబాట

- పులికుంట గ్రామపంచాయతీలో 13 యూనిట్లు పంపిణీ
- మారిన దళితుల తలరాతలు

రెబ్బెన, అక్టోబర్ 17: దళితబంధు లక్ష్యం నేరవేరుతున్నది. అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలన్న సీఎం కేసీఆర్ సంకల్పం సిద్ధిస్తున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా చేపట్టిన బృహత్తర దళితబంధు పథకం దళితులకు బతుకు దెరువు చూపుతున్నది. దళితబంధు పథకం కింద అందజేసిన యూనిట్లతో ఇప్పటికే మండలంలోని పులికుంట పరిధిలో13 దళిత కుటుంబాలకు దళితబంధుపథకం ద్వారా నిధులు వచ్చి పలు వ్యాపారాలు ప్రారంభించుకున్నారు. పలువురు డెయిరీ ఫాంలు ఏర్పాటు చేసుకొగా, మరికొందరు ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు కొనుగోలు చేశారు. మరికొందరు టెంట్‌హౌస్ సామగ్రి, ఫ్లెక్సీ ప్రింటర్ వ్యాపారాలు నడుపుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. ఇంతకాలంగా ఎదో ఒక పని చేస్తూ ఎల్లదీసిన బతుకులు, ఇంట్లో ఉన్న అందరూ కష్ట పడితేగాని ఇల్లు గడవని పరిస్థితి. కూలీ నాలి చేసుకొని జీవిస్తున్న దళితుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన దళితబంధుపథకంతో వారి జీవితాలే మారిపోతున్నాయి. తెలంగాణ సర్కారు ఎంపిక చేసిన లబ్ధిదారులకు 10లక్షల రూపాయలు వారి ఖాతాల్లో చేరడంతో వారు వివిధ రంగాల్లో పెట్టుబడి పెట్టి ఓనర్లుగా మారిపొయారు. కూలీ నుంచి యజమానిగా మారి పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడంపై దళితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దళితబంధు పథకం ద్వారా లబ్ధిపొందిన వారు ఇప్ప భీమయ్య, ముంజం మధును, గోగర్ల తిరుపతి, ఇప్ప శేఖర్, అరికిల్ల నరేశ్, మహేశ్, శంకరమ్మ, ఇప్ప గంగారం, ఇప్ప రమేశ్, పడిగెల రమేశ్, గోగర్ల హనుమంతు, దుర్గం శ్రీకాంత్, ఎల్లక్క లు డెయిరీఫాం, ట్రాక్టర్, కారు, ప్రింటింగ్‌ప్రెస్, టెంట్‌హౌస్, ఆటో, బర్లు కొనుగొలు చేసి ఓనర్లుగా మారి తల ఎత్తుకొని జీవిస్తున్నారు.



దళితబంధు పథకంలో ట్రాక్టర్‌ను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప (ఫైల్)

### కూలీ నుంచి ఓనర్‌గా..



చిన్నతనం నుంచి ట్రాక్టర్‌లపై పనికి వెళ్లేవాడిని, అలా వెళ్తూ ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకున్నాను. అన్న ట్రాక్టర్ కొనుగోలు చేయడంతో డ్రైవర్‌గా చాలా సంవత్సరాలు పని చేశాను. తెలంగాణ సర్కారు దళితబంధు పథకం ప్రవేశ పెట్టి అమలు చేసి మా గ్రామాన్ని ఎంపిక చేయడంతో గ్రామంలో ఉన్న అందరికీ దళితబంధు ద్వారా డబ్బులు వచ్చాయి. నాకు వచ్చిన డబ్బులతో ట్రాక్టర్ కొనుగోలు చేసి హాయిగా జీవిస్తూ మరికొంత మందికి ఉపాధి కల్పించడం చాలా ఆనందంగా ఉంది. దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న తెలంగాణ సర్కారుకు జీవితాంతం రుణపడి ఉంటా.

**- ఇప్ప గంగారం, ట్రాక్టర్ యజమాని, పులికుంట**

### దళితబంధు ఆదుకుంది..



ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మా కుటుంబాన్ని తెలంగాణ సర్కారు అమలు చేసిన దళితబంధు పథకం ఆదుకుంది. మా నాన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తల్లి, చెల్లిని చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉండటంతో ఎదో ఒక పని చేస్తూ చెల్లికి వివాహం చేశాను. ఈ క్రమంలో సర్కారు దళితబంధు ప్రవేశపెట్టి పులికుంట గ్రామాన్ని ఎంపిక చేయడంతో ఈ పథకం కింద నాకు 10 లక్షల రూపాయలు వచ్చాయి. దీంతో వచ్చిన డబ్బులకు మరికొన్ని డబ్బులు కలిపి మండలకేంద్రంలో ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేశాను. వ్యాపారం చాలా బాగా నడుస్తుంది. కేసీఆర్‌కు రుణ పడి ఉంటా.

**-దుర్గం శ్రీకాంత్ , ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమాని, పులికుంట**

### పాల వ్యాపారం బాగుంది..



తెలంగాణ సర్కారు దళితబంధు పథకం ద్వారా 10 లక్షల రూపాయలు అందించడంతో డెయిరీఫాం పెట్టుకున్నా. గతంలో ఇంట్లో బర్లు ఉండగా వాటి పాలు అమ్మిన అనుభవం ఉండడంతో దళితబంధు డబ్బులతో పాల వ్యాపారం మొదలు పెట్టా. వచ్చిన డబ్బులతో డెయిరీ ఏర్పాటు చేసి 7 బర్రెలు కొనుగోలు చేశాను. షెడ్డు నిర్మించి బోర్‌వెల్, పెన్సింగ్ వైర్‌తో కంచె, ప్రత్యేకంగా గడ్డి, దానా కోసం స్థలం ఏర్పాటు చేశాను. ఉదయం, సాయంత్రం పాలు తీస్తూ పాలకేంద్రం వద్ద విక్రయిస్తున్నా. పాల వ్యాపారం నన్ను ఓనర్‌ను చేయడం చాలా ఆనందంగా ఉంది. కేసీఆర్ సారుకు రుణపడి ఉంటా.

**- ఇప్ప భీమయ్య డెయిరీ ఫాం యజమాని, పులికుంట**

## జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ఆసిఫాబాద్,అక్టోబర్17: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మోర్ల సాక్షి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈనెల 15 నుంచి 17 వరకు వరంగల్‌లో జరిగిన జాతీయ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సాక్షి జావెలిన్ త్రో విభాగంలో 37.82 మీటర్ల దూరం విసిరి బంగారు పతకం సాధించిందని గిరిజన సంక్షేమ శాఖ క్రీడల అధికారి బండ మీనారెడ్డి, కోచ్ విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. గిరిజన క్రీడా పాఠశాల ఏర్పాటు అనంతరం మొట్టమొదటిసారిగా జాతీయ స్థాయిలో బంగారు పతకం ఈ పాఠశాల క్రీడాకారిణికి దక్కడంతో సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల శిక్షకుడు విద్యాసాగర్, క్రీడాకారిణి సాక్షిని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, డీడీ రమాదేవి, గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర క్రీడా అధికారి జ్యోతి, ఎసీఎంవో ఉద్ధవ్, ఎటీడబ్ల్యూవోలు క్షేత్రయ్య, కమర్ హుస్సేన్, పురుషోత్తం,జీసీడీఓ శకుంతల, క్రీడా ప్రధానోపాధ్యాయుడు ఎన్ కృష్ణారావు, జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి సాంబశివరావు, పేట అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు నరేందర్, కృష్ణమూర్తి, పీడీ, పీఈటీలు మధుసూదన్, క్రీడా శిక్షకులు అరవింద్, తిరుమల్, శంకర్, లక్ష్మణ్, అధ్యాపకులు అభినందించారు.

## దరఖాస్తు చేసుకోవాలి

కెరమెరి, అక్టోబర్ 17: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉట్నూర్ ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ కే.లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే శిక్షణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు ఆధార్‌కార్డు (రెండు జిరాక్స్‌లు), తెల్ల రేషన్ కార్డు(మీసేవ జిరాక్స్), ఎసెస్సీ మెమో జిరాక్స్‌తో పాటు ఒరిజనల్, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్, అకౌంట్ పాస్‌బుక్(రెండు జిరాక్స్‌లు), పాన్ కార్డు (రెండు జిరాక్స్‌లు), 4 పాస్ ఫోటోలు వెంట తీసుకురావాలన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి ఆసక్తి ఉన్న అభ్యర్థులు 26న ఉదయం 9 గంటలకు ఉట్నూర్‌లోని కే.బీ కాంప్లెక్స్‌లో హాజరు కావాలని, ఇతర వివరాలకు 9949412159, 8985633226, 9441530494, 8096093085లకు ఫోన్ ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

## ఎస్‌జీటీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 17: సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం ఆదేశాల అనుసారం మంగళవారం కుమ్రం భీం జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రావణ్. జిల్లా ప్రధాన కార్యదర్శి వైరాగడే వినోద్. గౌరవ అధ్యక్షుడిగా చెర్లోపల్లి నాగరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

## సన్మానం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 17: ఇటీవల సీఐఎస్ఎఫ్‌కు ఎంపికైన ఆసిఫాబాద్‌కు చెందిన పిడుగు మనికృష్ణ, ఉమైర్ జిన్ రెయిస్, సయ్యిద్ సుల్తాన్ అలీలను మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా(తారిక్), కార్యదర్శి శంకర్, కోట వెంకన్న, జిల్లా చైర్మన్ శంకర్, డైరెక్టర్ వీవినాయక్ రావు, సభ్యులు రావుల సవిత ఉన్నారు.

# ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఆర్ఎం సొలెమాన్

ఆసిఫాబాద్, అక్టోబర్17 : ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని ఆర్ఎం సొలెమాన్ పేర్కొన్నారు. డిపోలో మెరుగైన,అధిక రెవెన్యూ, అధిక కేఎంపీఎల్ తీసుకువచ్చిన డ్రైవర్లు, కండెక్టర్లను మంగళవారం డిపో ఆవరణలో డిప్యూటీ ఆర్ఎం ప్రణీత కుమార్, శ్రీధర్‌తో కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ కలసి కట్టుగా పని చేస్తే గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌ను సక్సెస్ చేయవచ్చన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌తో వివిధ విభాగాల్లో దాదాపుగా 14 మంది ఉద్యోగులు ఉత్తమ ప్రతిభ కనబర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆర్ఎం సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్ఎం సొలెమాన్